

## ఏఐ పై మాజీ ఉప రాష్ట్రపతి సంచలన వ్యాఖ్యలు



ఏపీ న్యూస్, 21 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సాంకేతికతలో వడివడిగా దూసుకెళ్తున్న కృత్రిమ మేథస్సు పై భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ అంటే భయమేస్తుందని, వింటేనే వణుకు పుడుతోందని ఆయన పేర్కొన్నారు.

విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విధ్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐతో మానవ సంబంధాలు మంటగలసి పోతాయోమోనని భయమేస్తోందని, వావివరుసలు ఎక్కడ మరిచిపోతారెమోనన్న భయం నాలో ఉందని అన్నారు. దీనికి పరిష్కార మార్గాన్ని ఆయన సూచించారు.

విద్వేషాలు రెచ్చగొట్టకుండా ఏఐని కట్టడి చేయాలని, ఏఐపై ఉన్న భయాలు తొలగించి ఏఐని అదుపులోకి చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. నైతిక పద్దతుల్లో విలువలతో కూడిన సాంప్రదాయబద్దంగా ఏఐని ఎలా ఉపయోగించుకోవాలన్నది సవాలేనని అన్నారు. లేని పక్షంలో ఏఐ మహాభూతమై సమాజాన్ని సంక్షోభమార్గంలో తీసుకు వెళుతుందని వెల్లడించారు.

ఏఐ వల్ల మానవాళికి నష్టం జరుగకుండా ప్రధాని మోదీ పలు సూచనలు చేశారని వివరించారు. సమాజం కూడా ఎప్పటికప్పుడూ స్పందించి పలు సూచనలు చేయాలని కోరారు. కేంద్రంలోని నరేంద్రమోదీ, ఏపీలో చంద్రబాబు నాయుడు ఏఐని టెక్నాలజీని ముందుకు తీసుకెళుతున్నారని ప్రశంసించారు. రాజకీయ నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారని, గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వాళ్లంతా ఓడిపోయారని అన్నారు.

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిపై రోహిత్ పవార్ సంచలన ఆరోపణలు



ఏపీ న్యూస్, 21 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న అజిత్ పవార్ విమాన ప్రమాదంలో ప్రాణాలు విడిచిన ఘటనపై అనుమానాలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి.. ఇప్పటికే అజిత్ పవార్ కుటుంబ సభ్యులు.. ఈ ఘటనపై సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు.. తాజాగా, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుపై సంచలన ఆరోపణలు అజిత్ పవార్ మేనల్లుడు రోహిత్ పవార్.. అజిత్ పవార్ విమాన ప్రమాదంపై దర్యాప్తు పారదర్శకంగా జరగాలంటే రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాల్సిందే అని డిమాండ్ చేశారు.. అజిత్ పవార్ ప్రయాణించిన లేజర్ జెట్ విమాన యజమాని వీఎస్సార్ సంస్థకి టీడీపీతో సంబంధాలున్నాయని పేర్కొన్నారు రోహిత్ పవార్..

మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతికి కారణమైన విమాన ప్రమాదంపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈ ప్రమాద దర్యాప్తు తీరును తప్పుబడుతూ ఆయన మేనల్లుడు, ఎన్‌సిపి (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసులో పారదర్శకత ఉండాలంటే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శరద్ పవార్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రోహిత్ పవార్ మాట్లాడుతూ, ఈ ప్రమాదంలో లోతైన కుట్ర దాగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

ఆయన లేవనెత్తిన ప్రధాన అంశాలు ఇవే:

టీడీపీ తో సంబంధాలు: అజిత్ పవార్ ప్రయాణించిన 'లియర్‌జెట్ 45' విమాన ఆపరేటర్ అయిన వీఎస్సార్ వెంచర్స్ సంస్థకు, తెలుగుదేశం పార్టీ అగ్రనేతలతో ఆర్థిక మరియు రాజకీయ సంబంధాలు ఉన్నాయని రోహిత్ పవార్ ఆరోపించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అదే పార్టీకి చెందిన వారు కావడంతో, దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగదని ఆయన వాదించారు.

ప్రధానికి లేఖ: ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరియు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రోహిత్ పవార్ లేఖలు రాశారు. అయితే, విమానంలోని డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్ సురక్షితంగా ఉండి, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ మాత్రం థర్మల్ డ్యామేజ్‌కు గురికావడంపై ఆయన సందేహాలు వ్యక్తం చేశారు. ఒకే చోట ఉండే రెండు పరికరాల్లో ఒకటి మాత్రమే ఎలా దెబ్బతింటుందని ఆయన ప్రశ్నించారు.

విమానయాన సంస్థ నిబంధనలను బేఖాతరు చేసిందని రోహిత్ పవార్ పేర్కొన్నారు.. డీజీసీఏ నిబంధనలకు విరుద్ధంగా, వేరే రకమైన విమానాల్లో శిక్షణ పొందిన పైలట్లను ఈ విమానానికి కేటాయించారని ఆరోపించారు. ఇక, విమానం ఇంజిన్ కాలపరిమితి కేవలం 85 గంటలు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ, దానిని తక్కువగా చూపించి విమానాన్ని నడిపారని పేర్కొన్నారు. మరోవైపు.. రూ.35 కోట్ల విలువైన విమానానికి రూ.55 కోట్లకు బీమా చేయించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దర్యాప్తుపై ప్రజల్లో నమ్మకం కలగాలంటే ప్రస్తుత కమిటీని రద్దు చేసి, కొత్త కమిటీని వేయాలని ఆయన కోరారు. ఆ కమిటీలో రిటైర్డ్ అధికారులు మరియు మాజీ న్యాయమూర్తులు ఉండాలి. ప్రతిపక్ష ప్రతినిధులు మరియు అజిత్ పవార్ కుటుంబ సభ్యులకు చోటు కల్పించాలి. ఒక నిర్దిష్ట కాలపరిమితిలోపు స్వతంత్ర దర్యాప్తు పూర్తి కావాలని డిమాండ్ చేశారు రోహిత్ పవార్..

## ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం ఏ2 నిందితుడు వాసుదేవరెడ్డి అరెస్ట్



ఏపీ న్యూస్, 21 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఏపీ బెవరెజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ, ఐఆర్టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. జగన్ హయాంలో జరిగిన ఏపీ మద్యం స్కాంకి సంబంధించి విజయవాడ ఏపీఎస్బీసీఎల్ కార్యాలయం నుంచి దస్త్రాలు, కంప్యూటర్ పరికరాలు, ఇతర కీలక పత్రాలను చోరీ చేశారన్న ఫిర్యాదుపై ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర అభియోగాలతో 2024 జూన్ నెలలో ఆయనపై కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సీఐడీ అధికారులు సోదాలకు వెళ్లిన సమయంలో వాసుదేవరెడ్డి పరారయ్యారు. అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్నారు. అయితే తాజాగా సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు.

## పల్నాడు వస్తే వైబ్రేషన్స్ వస్తాయి.. చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు



ఏపీ న్యూస్, 21 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): పల్నాడు వస్తే వైబ్రేషన్స్ వస్తాయి అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. పల్నాడు జిల్లా వినుకొండలో స్వర్ణాంధ్ర -- స్వఛ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు సీఎం చంద్రబాబు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు.. ఈ సందర్భంగా స్వచ్ఛ రథాలు ప్రారంభించారు సీఎం.. పారిశుద్ధ్య కార్మికులకు పుష్ కాట్స్ పంపిణీ చేశారు.. ఉద్యానశాఖ స్టాల్స్ పరిశీలించారు.. గుంటూరు కారం గురించి అడిగ తెలుసుకున్నారు.. ఆ తర్వాత స్వచ్ఛ సర్వేక్షణ్ 2047 బ్రోచర్ ను ఆవిష్కరించారు సీఎం చంద్రబాబు..

ఇక, రాబోయే రోజులన్నీ వినుకొండకు మంచి రోజులే అన్నారు చంద్రబాబు.. స్వర్ణాంధ్ర- స్వఛ్ఛాంధ్ర కార్యక్రమం కోసం ఇక్కడకు వచ్చాను. చెత్తనుంచి సంపద సృష్టించడంపట్ల సంతోషంగా ఉందన్నారు.. మండలానికి ఒక స్వచ్ఛ రథం ఇచ్చాం.. ప్రతి వారం మండలంలో అన్ని గ్రామాలు స్వచ్ఛ రథం తిరుగుతుందని తెలపారు.. పల్నాడు అనగానే పౌరుషాల గడ్డ.. కోటప్పకొండ తిరునాళ్ళు బ్రహ్మాండగా చేశారు. పల్నాడు వస్తే వైబ్రేషన్స్ వస్తాయి. శివరాత్రి ప్రభల కంటే కోటప్పకొండ ప్రభలు ఎంతో ఫేమస్ అని వెల్లడించారు.

మంత్రి నారాయణ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వఛ్ఛాంధ్ర కార్యక్రమాలు నడుస్తున్నాయి. నేను సీఎం అయ్యే సమయానికి రాష్ట్రంలో 108 లక్షల టన్నుల చెత్త రాష్ట్రంలో పేరుకుపోయింది. ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే నా ఉద్దేశం. అందుకే ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వఛ్ఛాంధ్రలో పాల్గొంటాను అని వెల్లడించారు చంద్రబాబు.. మార్చి 31 కల్లా వంద శాతం ఇంటి నుంచి చెత్త సేకరించేలా చేస్తాం. చెత్త ద్వారా మళ్లీ వస్తువుల ఉత్పత్తులు చేస్తాం. విశాఖలో చెత్త నుంచి కరెంటు తయారు చేస్తున్నారు. మరో ఐదు ప్లాంట్ల ద్వారా కరెంటు తయారు చేస్తాం అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రాష్ట్రంలో బ్యాన్ చేశాం.. రాబోయే రోజుల్లో ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో పెను మార్పులు తీసుకొస్తాం అని వెల్లడించారు.

సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ఎమ్మెల్యేలు ప్రజలవద్దకు వెళ్లాలని చెప్పాం అన్నారు చంద్రబాబు.. దేశంలో ఏ రాష్ట్రం కూడా మన రాష్ట్రంలో ఇచ్చినంత పెన్షన్ ఇవ్వడం లేదన్నారు.. ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలి. పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. అగ్రిటెక్ అందుబాటులోకి తీసుకొచ్చాం. బిల్ గేట్స్ వచ్చి మన టెక్నాలజీ వినియోగం చూసి ఆశ్చర్యపోయారు. వారసత్వంగా వచ్చే పంటలు పండిస్తే లాభాలు రావడం లేదు. ఐదు రూపాయలకే అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం పెడుతున్నాం. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నాం అని వెల్లడించారు సీఎం చంద్రబాబు నాయుడు

## జగన్ తిరుమలకు వెళ్లి క్షమాపణ చెప్పాలి : మంత్రి టీజీ భరత్



ఏపీ న్యూస్, 21 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వైసీపీ నేతలు చెప్పులు వేసుకుని వెంకన్న ఫొటోలను ప్రదర్శించడం బాధాకరమని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శనివారం కర్నూల్ లోను వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుద్ధి చేసి, అనంతరం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తిరుమల నెయ్యిలో కల్తీ జరిగింది వాస్తవమేనని, అందుకే జగన్ అడ్డంగా వాదిస్తున్నారన్నారు. చేసిన తప్పును ఒప్పుకుని జగన్ తిరుమలకు వెళ్లి క్షమాపణలు అడగాలని డిమాండ్ చేశారు. తిరుమల వెంకన్నతో పెట్టుకుంటే ఆయనే శిక్షిస్తారన్నారు.

రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సైతం ఈ ఇష్యూపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ.. తిరుమలలోనే కాకుండా శ్రీశైలం లడ్డూలోనూ కల్తీ నెయ్యిని సరఫరా చేసి.. భక్తుల నమ్మకాన్ని వొమ్ముచేసిందని విమర్శించారు. విజయ డెయిరీని కాదని రాజేష్ కార్పొరేషన్ ద్వారా కల్తీనెయ్యి సరఫరా చేయడం మహాపాపమన్నారు. శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాన్నే వైసీపీ భ్రష్టుపట్టించిందని దుయ్యబట్టారు. బ్రహ్మోత్సవాల్లో అలజడి సృష్టించేందుకు కుట్రలు పన్నినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. భక్తుల ఆగ్రహాన్ని ఎదుర్కోలేకనే వైసీపీ నేతలు నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. దేవాలయాల పవిత్రతను కాపాడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, భక్తుల విశ్వాసంతో ఆడుకున్న వైసీపీకి.. ప్రజలే బుద్ధిచెప్తారన్నారు.

## వేంకటేశ్వరస్వామి భక్తులా ? ఏసు భక్తులా ? : వైసీపీ నేతలపై భాను ప్రకాష్ ఫైర్



ఏపీ న్యూస్, 21 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఏపీ శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు అవలంభించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి తెలిపారు. శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. వైసీపీ సభ్యులపై తీవ్ర విమర్శలు చేశారు. దేవుడిని అవమానించేలా ప్రవర్తించిన వైసీపీ నేతలకు టీటీడీ నుంచి లీగల్ నోటీసులు పంపుతామని హెచ్చరించారు. జగన్ కళ్లలో ఆనందం కోసం.. మండలిలో వైసీపీ సభ్యులు దైవ ద్రోహానికి పాల్పడ్డారని మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా కాళ్లకు చెప్పులు వేసుకుని స్వామివారి చిత్రపటాలను ప్రదర్శించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు వేంకటేశ్వరస్వామి భక్తులా ? ఏసు భక్తులా? అని నిలదీశారు. దేవుడి పట్ల ఇలా చేయడం ఎంతవరకూ సమంజసం అని ప్రశ్నించారు. వేంకటేశ్వస్వామి భక్తులైతే ఈ విధంగా ప్రవర్తించేవారు కాదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు హిందూ సంప్రదాయంపై దాడి చేశారని, అధికారంలో లేనపుడు కూడా అదే చేస్తున్నారని ఆరోపించారు. టీటీడీని టార్గెట్ చేసి ఇదంతా చేస్తున్నారన్నారు. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్లోనే ఇదంతా చేస్తున్నారని, పెద్దల సభను రాక్షస సభగా మార్చేశారని దుయ్యబట్టారు.

## చెత్త ఇవ్వండి.. నిత్యావసరాలు తీసుకోండి : సీఎం చంద్రబాబు




ఏపీ న్యూస్, 21 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): చెత్త ఇవ్వండని, నిత్యావసరాలు తీసుకోండని ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా వినుకొండ లో స్వచ్ఛ రథాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మండలానికి ఒక స్వచ్ఛరథం ఉంటుందని తెలిపారు. పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారని చెప్పారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వాలన్నదే తన ఆలోచన అని పేర్కొన్నారు. గ్రామ స్వచ్ఛ రథాలు ప్రతి ఇంటి వద్దకు వచ్చి చెత్తను సేకరిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. తన ఆలోచనంతా ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వాలనే దానిపైనే ఉంటుందన్నారు. పౌరుషాల గడ్డ పల్నాడు అని, ఈ ప్రాంతానికి వస్తే వైబ్రేషన్స్ వస్తాయన్నారు. శివరాత్రి అంటే కోటప్పకొండ ప్రభలు ప్రత్యేకమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

